## క్లుప్తంగా

### డ్రైవర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఒంగోలు సెంట్రల్: నిరంతరం ప్రయాణికులకు సేవలు అందిస్తున్న ఆర్టీసీ సిబ్బందిపై కావలిలో రౌడీ మూకలు దాడి చేయటం హేయమైన చర్య అని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ తీవ్రంగా ఖండించినది. ఈనెల 26వ బెంగళూరు నుంచి విజయవాడకు వస్తున్న ఆటో నగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ రామ్ సింగ్ సైడు కోసం హారన్ కొట్టాడని నేపంతో అతనిపై విచక్షణ రహితంగా దాడి చేయటం, అడ్డుకోబోయిన మరో డ్రైవర్‌పై కూడా దాడి చేశారన్నారు. నాన్ బెయిలబుల్ సెక్షన్స్ కింద కేసు నమోదు చేసి తక్షణం అరెస్ట్ చేయాలని సంఘ డిపో కార్యదర్శి మాధవరావు, అధ్యక్షుడు వెంకటరావు, చైర్మన్ నాగరాజు, కోశాధికారి అంకినీడు ప్రసాద్ డిమాండ్ చేశారు.

### సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినుల ప్రతిభ

చీమకుర్తి: సంతనూతలపాడులోని మైనంపాడు ప్రభుత్వ డైట్ కాలేజీలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో కంభం మండలం ఎర్రబాలెం జిల్లాపరిషత్ హైస్కూలుకు చెందిన బాలికలు ప్రదర్శించిన నృత్యప్రదర్శన రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో మైనంపాడు డైట్ కాలేజీలో పాపులేషన్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో సత్తా చాటిన ఎర్రబాలెం హైస్కూలుకు చెందిన బాలికలు పావని, భారతి, కామేశ్వరి, రాజ్యలక్ష్మి, శివపార్వతి, లక్ష్మిలను కాలేజీ అధ్యాపకులు, కంభం హైస్కూలు హెచ్ఎం అభినందించారు. వారిని తీర్చిదిద్దిన సంగీత ఉపాధ్యాయుడు ఖాసింను అభినందించారు.

### రక్తదానం అంటే ప్రాణదానం



రక్తదాన శిబిరం వద్ద మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్నవారికి ప్రాణాలను దానం చేసినట్లే అని ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీసు యూనిట్ డాక్టర్ భానుమతి, డాక్టర్ విక్టర్ పాల్, సీఐలు భక్తవత్సల రెడ్డి, లక్ష్మణ్, రంగనాథ్, ఆర్ఐలు హరిబాబు పాల్గొన్నారు.

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు



ఒంగోలు: వాల్మీకి జయంతి వేడుకలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఒంగోలు మెట్రో: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి వాల్మీకి జయంతి పురస్కరించుకొని వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నారద మునిని కలిసినప్పుడు మహాముని జీవితంలో మలుపు తిరిగింది. హిందూ సంప్రదాయంలో వాల్మీకి గొప్ప కవులు, రుషుల్లో ఒకరిగా గౌరవించారని తెలిపారు. వీరి విజయాలు ముఖ్యంగా రామాయణం వాల్మీకి మహర్షిని ఆదికవి, భార్గవుడు, కవి కోకిల, వాక్యా విశారదుడు, మహా జ్ఞాని, భగవాన్ అని కూడా పిలుస్తారని తెలిపారు. ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది సంపూర్ణమ్మ, యం.శ్రీనివాసులు, డి.సందీప్, పి. ఇమ్మానుయేలు, యస్.అనిల్ బాబు, టి. గోవిందమ్మ, కార్యాలయ సిబ్బంది జి.శాంసన్, టి.కృష్ణవేణి, మృదుల్ కుమార్, స్మైలీ, నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.

**హిందూ ధర్మంతో జీవిత పరమార్థం**

ఒంగోలు మెట్రో: మానవ సంబంధాల మెరుగు కోసం రామాయణాన్ని అర్థం చేసుకోవాలని.. పారాయణ చేయాలని విశ్వహిందూ పరిషత్ మత మందిర అర్చక పురోహిత ప్రముఖ్ శివశంకర్ పేర్కొన్నారు. శనివారం ఆదికవి వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయము అయోధ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అత్రి మహాముని రామనామంతోనే 12 సంవత్సరాల పాటు కఠోర దీక్షతో కదలని స్థితిలో రామనామ జపాన్ని చేయగా చుట్టూ పెరిగిన పుట్టలు, ఆ పుట్టల మధ్య అత్యంత తేజస్సుతో బహిర్గతమైన రత్న శర్మను వాల్మీకిగా పిలవడం జరిగిందని తెలిపారు. అత్రి మహాముని సూచన మేరకు శ్రీరాముని 16 గుణాలను అధ్యయనం చేసి శ్రీ రామ చరిత్ర రామాయణమును లిఖించారని తెలిపారు. రాముని గుణగణాలను అర్థం చేసుకుంటే ధర్మం బలపడుతుందని కుటుంబ జీవనం మెరుగవుతుందని కుటుంబంలోని సభ్యుల మధ్య మరింతగా బాంధవ్యాలు బలపడతాయని తోడికోడళ్ళు, అత్తకోడళ్లు, స్నేహితులు మధ్య ఆప్యాయతలు పెరగడానికి రామాయణం అర్థం చేసుకోవాలని, రామాయణంలోని పలు ఉదాహరణలను తెలుపుతూ ప్రసంగించారు. ఎప్పుడైతే సనాతన గ్రంథాలైన రామాయణం భాగవతం భారతం పురాణాలను తెలుసుకుంటామో విశ్వహిందూ పరిషత్ కార్యాచరణ ముందుకు తీసుకువెళ్ళగలుగుతామని, దేశ స్థితిగతులు మార్చగలమని తెలిపారు. సమావేశంలో వాల్మీకి నివేదిత దేవత చిత్రపటాలకు పూలమాలను సమర్పించారు. సత్సంగ్ ప్రముఖ్ సోమ సుబ్బారావు, విశ్వహిందూ పరిషత్ నగరాధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వర్లు, సాదు శ్రీనివాస గుప్తా, పబిశెట్టి శ్రీనివాసులు, ఈమని బలరామ్, సి.హెచ్ పాపారావు, పబ్బిశెట్టి హరిబాబు, దేవ కుమారి, ఎం. సూర్యకుమారి, డి జయమ్మ, ప్రచార ప్రముఖ్ రాధా రమణ గుప్తా జంధ్యం పాల్గొన్నారు

ఒంగోలు సెంట్రల్: కృషి ఉంటే మనుషులు రుషులవుతారని వాల్మీకి మహర్షి జీవితం ఒక ఉదాహరణ అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. వి. ఎస్ లోకేశ్వరరావు అన్నారు. స్టెప్ కార్యాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ జయ తదితరులు పాల్గొని వాల్మీకి జీవిత చరిత్రను వివరించారు.

## ఇంటింటికీ ఆరోగ్యమే జగనన్న సురక్ష లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో కమిషనర్ వెంకటేశ్వర్లు, మేయర్ సుజాత

ఒంగోలు టౌన్: ఆరోగ్యమే సౌభాగ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం భరోసా కలిగించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. శనివారం నగరంలోని ధారావారితోట, త్రోవగుంట, సత్యనారాయణ పురం సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరాల్లో పాల్గొన్న మేయర్ మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి గొప్ప పథకం అమలు జరగడం లేదని, ఈ ఘనత కేవలం జగనన్నకు మాత్రమే దక్కుతుందని చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలో 11 రకాల పరీక్షలను ఉచితంగా చేయడమే కాకుండా అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. 270 మందికి కేసు షీట్ జనరేట్ చేసినట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంహెచ్ఓ మనోహరరెడ్డి , కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య, డివిజన్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగవంత్ కేసరి సినిమా బృందం శనివారం రాత్రి ఒంగోలులో సందడి చేసింది. నగరంలోని కృష్ణ థియేటర్‌లో నిర్వహించిన విజయోత్సవంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి, నటి శ్రీలీల, ఇతర నటీనటులు పాల్గొని ప్రేక్షకులను అలరించారు. - సాక్షి, ఒంగోలు

### రైతుల జాబితా సరి చూసుకోవాలి

మద్దిపాడు: రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి పంటల నమోదు జాబితా చూసుకుని తప్పులు ఉంటే సరి చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె. రమేష్ అన్నారు. పెదకొత్తపల్లి ఆర్‌బీకేలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో జాబితాలు ప్రదర్శించారని, జాబితాలో సరి చూసుకోవాలని తెలిపారు. 26వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ గ్రామాల్లో రైతులకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏమైనా తప్పుగా వస్తే ఆర్‌బీకేల వద్ద వీఏఏలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఈఓ పి. శేషయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

### సమాన పనికి సమాన వేతనం

చీమకుర్తి: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చీమకుర్తి మున్సిపల్ కార్మికులు శనివారం కార్యాలయం ప్రాంగణం వద్ద ధర్నా చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

### ఇ- శ్రమ్‌తో అసంఘటిత కార్మికులకు ఆసరా

ఒంగోలు టౌన్: ఇ- శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకోవడం వలన అసంఘటిత కార్మికులు, వలస కార్మికులు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను పొందవచ్చని ఉప కార్మిక శాఖ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కార్మిక శాఖ కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాల నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇ- శ్రమ్‌లో పేర్లు నమోదు చేసుకున్న అసంఘటిత కార్మికులకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు, ప్రమాదంలో పూర్తిగా అంగవైకల్యం కలిగితే రూ. 2 లక్షల సహాయం అందించనున్నట్లు తెలిపారు. పాక్షికంగా అంగవైకల్యం కలిగిన వారికి లక్ష రుపాయల ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉందన్నారు. వలస కార్మికులు రేషన్ కార్డు పొందే విషయంలో ఏదైనా సమస్యలు వస్తే పరిష్కరిస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఉదయ భాస్కర్ చెప్పారు. 2024లో కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. సహాయ కార్మిక కమిషనర్ కె.కె.డి భవాని, ఎస్ఎస్‌పీఓ బి.అనిత, కె. పవన్ కుమార్, సహాయ కార్మిక అధికారులు యం.వెంకటేశ్వర్లు, ఎలిజబెత్, సయ్యద్ సర్దార్, పీవీఆర్ చౌదరి, కె.వెంకటేశ్వర్లు, పి.మహేష్ పాల్గొన్నారు.

### బూచేపల్లి రూ.25 వేల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడాకారిణిలకు బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి శనివారం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయి డాడ్జిబాల్ పోటీలకు ఎంపికైన ప్రియాంక, పవిత్ర ఈనెల 30న వారణాసిలో జరిగే పోటీలలో పాల్గొనాల్సి ఉంది. వారితో పాటు ఇంటర్ స్టేట్ పోటీలలో పాల్గొనేందుకు పి.చాందిని ఎంపిక కావడంతో త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పోటీల్లో పాల్గొనాలి. రాకపోకలు, స్పోర్ట్స్ షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అవసరాల నిమిత్తం బూచేపల్లి ట్రస్ట్ ద్వారా రూ.25 వేలను సద్వినియోగం చేసుకోవాలని అందించి, విజేతలుగా తిరిగి రావాలని ఆశీర్వించారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, గరల్స్ హైస్కూలు హెచ్ఎం జి.వీరాస్వామి, పీడీ డి.స్వరూపావాణి, టీచర్‌లు జీవీ భవాని, చల్లా శ్రీనివాస్, స్థానిక నాయకులు కౌన్సిలర్ తప్పెట బాబూరావు, పాలడుగు సుబ్బారావు పాల్గొన్నారు.

### స్వయం ఉపాధిపై అవగాహన

చీమకుర్తి: స్వయం సహాయక గ్రూపుల్లోని సభ్యులు స్వంతంగా జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచుకునేందుకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ విజ్ఞప్తి చేశారు. శనివారం బొడ్డువారిపాలెం, తక్కెళ్ళపాడు, కామేపల్లివారిపాలెం, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన స్వయం సహాయక గ్రూపు సభ్యులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ఏపీఎం సుధాకర్ ఆధ్వర్యంలో వారి సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు.